

రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోంలో భాగంగా ద్రౌపది ముర్ముకు నమస్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, సుధీర్‌రెడ్డి, ఎంపీలు కే కేశవరావు, బీబీ పాటిల్, పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ మహమూద్ అలీ తదితరులు

# కారు స్టీరింగ్ పట్టిన కేటీఆర్

- తెలంగాణభవన్ టు బొల్లారం
- స్వయంగా కారు నడుపుతూ రాష్ట్రపతి విందుకు..
- పక్క సీట్లో కూర్చున్న హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం హైదరాబాద్‌లో స్వయంగా కారు నడుపుతూ పలువురి దృష్టిని ఆకర్షించారు. అదే కారులో ఆయన పక్కన మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా కూర్చోవడంతో ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. శీతాకాల విడిదిలో భాగంగా హైదరాబాద్‌లో బస చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం బొల్లారంలోని తన నిలయంలో రాష్ట్ర ప్రముఖులకు ఆతిథ్యం ఇచ్చారు. రాష్ట్రపతి ఆహ్వానం మేరకు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తెలంగాణభవన్ నుంచి బొల్లారం బయలుదేరారు. కేటీఆర్ తెలంగాణభవన్ నుంచి బయలుదేరే సమయంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కారులో (డిఫెండర్) వెళ్లారు. తానే డ్రైవ్ చేస్తానని కేటీఆర్ పేర్కొనడంతో అప్పటిదాకా ఉన్న డ్రైవర్ ఆయనకు స్టీరింగ్ ఇచ్చారు. డ్రైవర్ సీట్లో కేటీఆర్, ఆయన పక్కన హరీశ్‌రావు కూర్చున్నారు. అక్కడి నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం వరకు కేటీఆరే డ్రైవ్ చేసుకుంటూ వెళ్లారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో 'కృష్ణార్జునుల స్పెషల్' అని వైరల్ కావడం విశేషం.

**రాష్ట్రపతి ఆతిథ్యానికి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు**

బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన ఎట్‌హోం (తేనీటి విందు)కు కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, లోక్‌సభలో బీఆర్ఎస్ పక్షనేత నేత నామా నాగేశ్వర్‌రావు, ఎంపీలు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కోవ లక్ష్మి, విజేయుడు, లాస్య నందిత, మాణిక్‌రావు, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, శంభీపూర్ రాజు, దండె విఠల్, నవీన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

# తెలంగాణ ప్రగతి ప్రస్థానంపై స్వేదపత్రం

మొదటిపేజీ తరువాయి...

తేడా లేకుండా రెక్కల కష్టంతో చెమటోడ్చి నిర్మించిన తెలంగాణ ప్రతిష్ఠను దెబ్బతీస్తే సహించం. విఫల రాష్ట్రంగా చూపించాలని ప్రయత్నిస్తే భరించం. అగ్రగామి రాష్ట్రాన్ని అవమానిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోం. అందుకే గణాంకాలతో సహా వాస్తవ తెలంగాణ ముఖచిత్రాన్ని వివరించేందుకు.. అప్పులు కాదు.. తెలంగాణ రాష్ట్రానికి సృష్టించిన సంపదను ఆవిష్కరించేందుకు తెలంగాణ భవన్ వేదికగా శనివారం ఉదయం 11 గంటలకు స్వేద పత్రం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటుంది' అని ట్వీట్ చేశారు.

# ఆటో డ్రైవర్ల సమస్యలపై కమిటీ: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధ్యయనానికి పార్టీ కార్మిక విభాగం ఆధ్వర్యంలో కమిటీని వేస్తున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కే తారకరామారావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్లు తమ స్థితిగతులపై ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో.. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు వారి సమస్యలు, పరిష్కార మార్గాలు తెలుసుకొనేందుకు కమిటీ వేస్తున్నట్టు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ కమిటీలో కార్మిక విభాగం నాయకులు రూప్‌సింగ్, రాంబాబు యాదవ్, మారయ్య ఉంటారని, వీరు ఆటోడ్రైవర్ల ప్రతినిధులతో మాట్లాడుతారని పేర్కొన్నారు. ఆటోడ్రైవర్లే కాకుండా రాష్ట్రంలో ఉన్న ఓలా, ఉబర్, ఇతర టాక్సీడ్రైవర్లతోనూ చర్చించి నివేదికను అందజేస్తారని వివరించారు. నివేదిక ఆధారంగా ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలను ఇస్తామని, ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు.

# తెలంగాణను కించ పరిచేందుకే శ్వేతపత్రాలు

- అప్పులపై దుష్ప్రచారంతో పెట్టుబడులకు విఘాతం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దాసోజు శ్రవణ్ బహిరంగ లేఖ



హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణను కించపరిచేందుకే కాంగ్రెస్ శ్వేతపత్రాల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీసిందని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. శ్వేతపత్రాలు తెలంగాణను వ్యతిరేకించే ఆంధ్ర మేధావులు, పెట్టుబడిదారులు, తెలంగాణద్రోహులు అందరూ కూడగట్టుకుని తయారు చేసినట్టే ఉన్నాయని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడే తెలంగాణ అభివృద్ధి చెందితే మరి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఎందుకు పుట్టుకొచ్చేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ తీరు తెలంగాణ ఉద్యమాన్ని, అస్థిత్వాన్ని, అమరవీరుల త్యాగాలను కించపరిచేలా ఉన్నదని విమర్శించారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ మీద అక్కసుతో అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారం భవిష్యత్ పారిశ్రామిక పెట్టుబడులకు విఘాతం కలిగించే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. శ్వేతపత్రాల విడుదలకు కోట్ల రూపాయల ఖర్చుతో అసెంబ్లీ సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. మీడియా ద్వారా ఆ పత్రాలు విడుదల చేస్తే సరిపోయేది కదా? అని పేర్కొన్నారు. తప్పు జరిగితే విచారణకు ఆదేశించడానికి అసెంబ్లీ సమావేశాలు వేదిక కావాలా? అని నిలదీశారు. తెలంగాణ అప్పుల పాలైందనే ప్రచారంతో రాష్ట్ర భవిష్యత్ అంధకారమయ్యే అవకాశం ఉన్నదని, మళ్లీ చీకట్లు కమ్ముకునే ప్రమాదం పొంచి ఉన్నదని.. ఇకనైనా రాజకీయ స్వార్థాలను పక్కనపెట్టి తెలంగాణ భవిష్యత్ కోసం ముందుకు సాగాలని హితవు చెప్పారు. ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

# ప్రతి పేదకూ ప్రభుత్వ సహకారం

- నిస్సహాయులకు సహాయం అందించడం ప్రభుత్వ ధ్యేయం
- చెప్పినట్టుగానే డిసెంబర్‌లో తెలంగాణలో మిరాకిల్ జరిగింది
- పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలువాలని కోరుకోండి
- క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి



శుక్రవారం ఎల్బీ స్టేడియంలో చిన్నారులకు క్రిస్మస్ గిఫ్టులు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, పేదల అభివృద్ధికి కాంగ్రెస్ పాటుపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. డిసెంబర్ నెలలో రాష్ట్రంలో అద్భుతం జరుగుతుందని తాను చెప్పానని, అది నిజమైందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం ప్రభుత్వ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం మాట్లాడుతూ.. 'నిస్సహాయులకు సహాయం అందించడం మా ప్రభుత్వ ధ్యేయం. అర్హత కలిగిన వారికి అవకాశాలు కల్పించడం మా ప్రభుత్వ లక్ష్యం. ఈ వేదికగా మీకు మాట ఇస్తున్నా.. తెలంగాణలో ఏర్పడ్డ ఇందిరమ్మ రాజ్యం పేదల అభివృద్ధికి పాటుపడుతుంది. సంక్షేమ పథకాలను ప్రతీ పేదకు చేరేలా చూస్తాం. మేం పాలకులం కాదు..సేవకులం. ఏసుక్రీస్తు మాకు ఆదర్శం. బాధ్యతను మరవకుండా పనిచేస్తూ ముందుకెళతాం. ఏ సమస్య వచ్చినా మా దృష్టికి తీసుకురండి. సచివాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. తప్పకుండా సమస్యలను పరిష్కరిస్తాం' అని హామీ ఇచ్చారు. ప్రపంచానికి డిసెంబర్ మిరాకిల్ నెల అని, డిసెంబర్‌లో తెలంగాణలో కూడా మిరాకిల్ జరిగిందని అన్నారు. క్రైస్తవులు, మైనార్టీలు రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావాలని కోరుకున్నారని, వారు కోరినట్టుగానే నూతన ప్రభుత్వాన్ని తీసుకొచ్చారని పేర్కొన్నారు.

**పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించండి**

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కూడా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మైనార్టీలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'మొన్న కర్ణాటక, నిన్న హిమాచల్‌ప్రదేశ్, నేడు తెలంగాణలో సెక్యులర్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఇంతకంటే మరో గురుతర బాధ్యత మీపై ఉన్నది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గెలువాలని కోరుకోండి. మణిపూర్ సంఘటన ప్రస్తుత బీజేపీ వైఖరిని తెలియజేస్తున్నది. మణిపూర్‌లో బాధితులను పరామర్శించడానికి రాహుల్‌గాంధీ ప్రయత్నిస్తే అడ్డుకున్నారు. అలాంటి ఘటనలు దేశంలో ఎక్కడా జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నది' అని అన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలను సీఎం అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ రవి గుప్తా, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, క్రైస్తవ మత పెద్దలు, ఫాస్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# లోకం పోకడ




చలికి గజగజ వణుకుతుంటే స్వెట్టర్‌కు బదులు పేపర్ ఇచ్చిన.. అంతే.. గరం గరం అయ్యాడు!

# చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 6.8°c | 32.5°c |
| రంగారెడ్డి | 7.2°c | 33.2°c |
| మెదక్ | 8.7°c | 30.0°c |
| హైదరాబాద్ | 12.5°c | 29.7°c |
| నిజామాబాద్ | 13.2°c | 29.3 °c |
| నల్లగొండ | 14.4°c | 32.8°c |
| కరీంనగర్ | 15.0°c | 28.0°c |
| మహబూబ్‌నగర్ | 15.4°c | 30.14°c |
| వరంగల్ | 16.0°c | 28.0°c |
| ఖమ్మం | 17.0°c | 28.0°c |

## నేడు పీవీ 19వ వర్ధంతి సంస్మరణ సభ

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 19వ వర్ధంతి సంస్మరణ సభను శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగనున్నది. పీవీమార్గ్ (నెక్లెస్‌రోడ్)లోని పీవీ జ్ఞానభూమి ఆవరణలో ఉదయం 9 గంటలకు పుష్పాంజలి, ప్రార్థనలు, భజనలు, సర్వమత ప్రార్థనలు జరుగుతాయి. అనంతరం కుటుంబ సభ్యులతో ఉదయం 10.10 గంటలకు ఛాయా చిత్ర ప్రదర్శన, 10.30కు వైద్య, రక్తదానం శిబిరాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తారు.

## హౌసింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గృహనిర్మాణ సంస్థలో అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర గృహనిర్మాణ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం సచివాలయంలో మంత్రిని తెలంగాణ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గవ్వ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. సంస్థ ఉద్యోగులు 2016 జూలై 14 నుంచి ప్రభుత్వంలోని 31 ఇతర శాఖల్లో పనిచేస్తున్నట్టు మంత్రికి వివరించారు. ఇతర శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను మాతృ సంస్థలోకి తీసుకోవాలని కోరారు. మూడు దశాబ్దాలకు పైగా ఒకే క్యాటగిరీలో పనిజేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లకు అసిస్టెంట్ ఇంజినీర్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జీ రఘువీర్ ప్రసాద్‌గుప్తా, కోశాధికారి జేఆర్ఎస్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బీ వెంకట్రామిరెడ్డి, ప్రతినిధులు ఎండీ ఫహీం అహ్మద్, డీ రవీందర్‌నాయక్, ఎస్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో పంట కొనుగోళ్లు

- వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): పంట ఉత్పత్తులను సకాలంలో రైతుల నుంచి సేకరించి రైతులకు అండగా నిలబడాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. శుక్రవారం తన నివాసంలో మార్క్‌ఫెడ్ కార్యకలాపాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎరువుల సరఫరా, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, రైతులకు సకాలంలో మద్దతు ధర అందించడం వంటి అంశాలపై మంత్రి చర్చించారు. ఇతర రాష్ట్రాల సమన్వయంతో పంట ఉత్పత్తుల డిమాండ్లను అధ్యయనం చేయాలని, మెరుగైన విధానాలు రూపొందించాలని చెప్పారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన అన్నిరకాల ఎరువులను అందుబాటులో ఉంచి రైతులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్క్‌ఫెడ్ సంస్థ నష్టాలను తగ్గించుకొని, లాభాలు గడించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్‌రావు, ప్రొక్యూర్‌మెంట్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## బౌద్ధ అవశేషాల ఉనికిని గుర్తించండి

- గనుల శాఖకు బుద్ధవనం ఓఎస్డీ మల్లేపల్లి

హైదరాబాద్, డిసెంబర్22 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో గనుల తవ్వకాల కోసం కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ చేపట్టే సర్వేక్షణలో బౌద్ధ స్థావరాల ఉనికిని గుర్తించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావుకు వినతిపత్రం అందజేశారు. బౌద్ధ స్థావరాల ఉనికి గుర్తింపు కోసం భారత భూగర్భ సర్వేక్షణ అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. యాదాద్రి-భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం చాడ గ్రామంలో శాతవాహన-ఇక్ష్వాకుల కాలం నాటి సున్నపు రాతి బుద్ధుని బొమ్మలు బయట పడ్డాయని, అక్కడి పురాతన స్థలం 10 ఎకరాల్లో విస్తరించి ఉన్నదని, ఎంత మేరకు పురాతన కట్టడాలున్నాయో రిమోట్ సెన్సింగ్ ద్వారా సర్వే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అందుకు కాంతారావు సానుకూలంగా స్పందించారని మల్లేపల్లి పేర్కొన్నారు. కార్యక్రమంలో బుద్ధవనం కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, డిజైన్ ఇన్‌చార్జి, డీఆర్ శ్యాంసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

# 2 నెలల పసిపాపకు కరోనా

మొదటిపేజీ తరువాయి...

ఎలాంటి పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు ఆక్సిజన్, వెంటిలేటర్, ఇతర అత్యవసర వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

**కరోనాపై భయం వద్దు**

పిల్లలో కరోనా వైరస్‌కు సంబంధించి తల్లిదండ్రులు భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కరోనా నోడల్ అధికారి డాక్టర్ రమేశ్ దాంపురి తెలిపారు. గతంలోనూ ఈ వైరస్ పిల్లలపై పెద్దగా ప్రభావం చూపలేదని వెల్లడించారు. శ్వాససంబంధ సమస్యలున్న పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చిన్నపిల్లలున్న కుటుంబసభ్యులు కరోనా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ముందు జాగ్రత్త చర్యగా నిలోఫర్‌లో 24 పడకలతో ప్రత్యేక ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశామని వివరించారు.

**అన్ని దవాఖానల్లో మాస్క్ మస్ట్: డీఎంఈ డాక్టర్ త్రివేణి**

రెండు, మూడు రోజుల్లోనే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో దాదాపు 20 కేసులు నమోదవటం, నిలోఫర్‌లో ఇద్దరు చిన్నారులకు సైతం సోకటంతో వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. రాష్ట్రంలోని అన్ని టీచింగ్ హాస్పిటల్స్‌లో వైద్యాధికారులు, సిబ్బంది కరోనా నియమాలు పాటించాలని డీఎంఈ డాక్టర్ త్రివేణి ఆదేశాలు జారీ చేశారు. కచ్చితంగా మాస్క్ ధరించాలని సూచించారు. దీంతో అన్ని ప్రభుత్వ టీచింగ్ హాస్పిటల్స్‌లో శుక్రవారం నుంచి కరోనా నియమాలు అమల్లోకి వచ్చాయి. వైద్య సిబ్బందితో పాటు రోగులు, రోగి సహాయకులు సైతం మాస్కులు ధరించేలా అధికారులు అవగాహన కల్పిస్తూ చర్యలు తీసుకుంటున్నారు. కాగా, ప్రస్తుతం రాష్ట్రంలో కరోనా పరిస్థితులపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు.

**అత్యవసరమైతే తప్ప దూర ప్రయాణాలు వద్దు**

వైరస్ వ్యాప్తి నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప దూర ప్రయాణాలు పెట్టుకోవద్దని వైద్యులు సూచిస్తున్నారు. సాధ్యమైనంత వరకు జన సమూహాలకు దూరంగా ఉండాలని, రానున్న క్రిస్‌మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి తదితర పండుగల సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్తున్నారు. వాతావరణం కూడా చల్లగా ఉండటం, వరుస పండుగల నేపథ్యంలో వైరస్ వ్యాప్తికి అవకాశం ఉన్నదని వెల్లడించారు.

### కొత్తగా 11 కొవిడ్ కేసులు

రాష్ట్రంలో శుక్రవారం కొత్తగా 9 కరోనా కేసులు వెలుగు చూశాయి. ఇందులో 8 కేసులు హైదరాబాద్‌లో వెలుగుచూడగా, రంగారెడ్డి, వరంగల్, భూపాలపల్లి జిల్లాల్లో ఒకటి చొప్పున నమోదయ్యాయి. మరోవైపు ఒకరు కోలుకొని డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం రాష్ట్రంలో 27 యాక్టివ్ కేసులు ఉన్నట్టు అధికారులు తెలిపారు. శుక్రవారం మొత్తం 1,245 మందికి కొవిడ్ పరీక్షలు నిర్వహించినట్టు వెల్లడించారు. ఇందులో 68 నమూనాలకు సంబంధించిన ఫలితాలు రావాల్సి ఉన్నదని వివరించారు. కొవిడ్‌పై సహాయం కోసం 104 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వినతులు, ప్రైవేట్ దవాఖానలు, ల్యాబ్‌లపై ఫిర్యాదుకు 9030227324 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

### జేఎన్.1 వేరియంట్ లక్షణాలు

- జ్వరం
- ముక్కు కారటం
- గొంతు నొప్పి
- పొడి దగ్గు
- తలనొప్పి, ఒళ్లు నొప్పులు
- విరేచనాలు
- తీవ్ర అలసట
- ఆయాసం, కండరాల బలహీనత
- శ్వాస సంబంధిత సమస్యలు
- వైరస్ సోకిన నాలుగైదు రోజులకు ఈ లక్షణాలు కనిపించే అవకాశాలున్నాయని వైద్యులు తెలిపారు.

# కిడ్నాప్ కేసులో ఎమ్మెల్యే కొడుకు?


బేగంపేట, డిసెంబర్ 22: ఆర్థిక లావాదేవీల విషయంలో ముగ్గురు స్నేహితులతో కలిసి ఓ యువకుడిని కిడ్నాప్ చేసి, చితకబాదిన ఘటనలో నల్లగొండ జిల్లాకు చెందిన ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే కొడుకు పాత్ర ఉన్నట్టు తెలిసింది. ఈ ఘటనపై బేగంపేట ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. రితిక్‌రెడ్డి కారును రసూల్‌పుర ఇందిరమ్మనగర్ నివాసి మహ్మద్ హైదర్(25) రితిక్‌కు తెలియకుండా రాజస్థాన్‌లో విక్రయించాడు. విషయం తెలుసుకున్న రితిక్‌రెడ్డి రాజస్థాన్‌కు వెళ్లి రూ.8 లక్షలు చెల్లించి కారును తెచ్చుకున్నాడు. ఈ డబ్బుల విషయమై హైదర్‌తో రితిక్‌రెడ్డి మాట్లాడగా, రూ.4 లక్షలు చెల్లిస్తానని అగ్రిమెంట్ రాసిచ్చాడు. ఎంతకీ డబ్బులు ఇవ్వకపోవడంతో హైదర్‌ను బొల్లారం వీబీ సిటీలోని రితిక్‌రెడ్డి గదిలో బంధించారు. తనను కిడ్నాప్ చేశారంటూ తండ్రికి హైదర్ మెసేజ్ చేశాడు. ఆయన బేగంపేట పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, విషయం తెలుసుకున్న రితిక్ స్నేహితులు హైదర్‌ను చితకబాదారు. రాత్రి 8 గంటలకు హైదర్‌ను బేగంపేట ఠాణా వద్ద వదిలివెళ్లారు. బాధితుడు తనను కిడ్నాప్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఠాణాలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ధరణి సేవలకు తాత్కాలిక బ్రేక్?

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 'ధరణి' పోర్టల్ సేవలను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలిసింది. రిజిస్ట్రేషన్లు మినహా ఇతర సేవలన్నింటినీ ఆపేయాలంటూ రెవెన్యూ శాఖ నుంచి అధికారులకు మౌఖిక ఆదేశాలు వెళ్లినట్టు సమాచారం. ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తీసుకొస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఇటీవల ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ధరణి పనితీరు, పోర్టల్‌లో ఎలాంటి సమస్యలు ఉన్నాయి? వాటిని ఏ విధంగా పరిష్కరించాలి? తదితర వివరాలపై 10 రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. 'ధరణి' ద్వారా రిజిస్ట్రేషన్లు సులువుగా జరుగుతున్న విధానాన్ని సీఎం అభినందించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో కొత్త పోర్టల్ తేవాలా? లేక 'ధరణి'లోనే మార్పులు, చేర్పులు చేసి పేరును మార్చాలా? అనే అంశంపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతున్నట్టు సమాచారం. భూ సంబంధ సమస్యలు, పరిష్కారంపై స్పష్టత వచ్చే వరకు ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు, నాలా కన్వర్షన్లు మినహా ఇతర సేవలన్నింటినీ నిలిపివేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తున్నది.

# మాదిగలను వంచించిన బీజేపీ, కాంగ్రెస్

- ఎమ్మార్పీఎస్ తెలంగాణ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ



హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణపై కమిటీ వేసి, ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా బీజేపీ మరోసారి మాదిగలను మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో తెలంగాణ మాదిగల విశ్వరూప మహాసభకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఎస్సీ వర్గీకరణపై కమిటీ ఏర్పాటు చేసి వర్గీకరిస్తామని ఇచ్చిన హామీని ఈ పార్లమెంట్ సమావేశాల్లో నెరవేర్చలేదని అన్నారు. కాంగ్రెస్ నేతలు వర్గీకరణ వ్యతిరేకులను పక్కన పెట్టుకొని మాదిగలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు యాతాకుల భాస్కర్‌మాదిగ, చిలకమర్రి గణేశ్‌మాదిగ, హుస్సేన్ మాదిగ, కొల్లూరు వెంకట్ మాదిగ, వరిగడ్డి చందుమాదిగ, మారపాక నరేందర్‌మాదిగ, ఎల్ నాగరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# 'సంస్కరణ'లకే డాక్టర్ల ఓటు!

- టీఎస్ఎంసీ ఎన్నికల్లో హెచ్ఆర్డీఏ ఘన విజయం
- అన్ని స్థానాలు కైవసం

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) ఎన్నికల్లో డాక్టర్లు 'సంస్కరణ'ల వైపే మొగ్గుచూపారు. వైద్య రంగంలో సంస్కరణలు కోసం గళం వినిపిస్తున్న 'హెల్త్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్' (హెచ్ఆర్డీఏ) ప్యానల్‌కు ఘన విజయం కట్టబెట్టారు. మొత్తం 13 స్థానాలకు ఎన్నికలు జరుగగా, అన్నింటిని హెచ్చార్డీఏ కైవసం చేసుకుంది. టీఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ ఈ ఏడాది ఆగస్టులో విడుదలైంది. మొత్తం 96 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. హెచ్చార్డీఏతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యుల సంఘాలు పోటీపడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రిజిస్టర్డ్ వైద్యులు బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 17,090 ఓట్లు పోల్ అయ్యాయి. అత్యధికంగా డాక్టర్ ప్రతిభాలక్ష్మి 7,007 ఓట్లను సాధించగా, హెచ్ఆర్డీఏ అధ్యక్షుడు డాక్టర్ మహేశ్‌కుమార్ 6,735 ఓట్లు సాధించారు. 13 స్థానాలను హెచ్చార్డీఏనే గెలుచుకున్న నేపథ్యంలో చైర్మన్ పదవి సంఘానికే దక్కుతుందని భావిస్తున్నారు.



నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును సన్మానించిన సొసైటీ సభ్యులు

# నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా శ్రీధర్‌బాబు

అబిడ్స్, డిసెంబర్ 22: నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ కొత్త అధ్యక్షుడిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నియమితులయ్యారు. గతంలో అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి హరీశ్‌రావు తన పదవికి రాజీనామా చేయడంతో ఎగ్జిబిషన్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించి, ఏకగ్రీవంగా శ్రీధర్‌బాబును ఎన్నుకున్నది. జనవరి 1న ప్రారంభం కానున్న 83వ అఖిల భారత పారిశ్రామిక ఎగ్జిబిషన్‌కు సీఎం రేవంత్‌రెడ్డిని ముఖ్యఅతిథిగా ఆహ్వానిస్తామని సొసైటీ ప్రతినిధులు తెలిపారు.

# రిమాండ్‌కు సీఐ ప్రసాద్

నాంపల్లి కోర్టులు, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): చిక్కడపల్లి ఠాణా పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఈసంపల్లి రాజును కిడ్నాప్ చేసి, చితకబాదిన కేసులో వీఆర్ సీఐ యాదవెల్లి కేసరి ప్రసాద్‌తో పాటు షమీ మోహియొద్దీన్, కూరెల్లి రామకృష్ణకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ శుక్రవారం 9వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ భాస్కర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థిక లావాదేవీల విషయంలో రాజును ప్రసాద్‌తో పాటు షమీ, రామకృష్ణ కిడ్నాప్ చేశారు. ఠాణాలోని క్రైంగదిలోకి తీసుకెళ్లి తాళ్లతో కట్టి తీవ్రంగా కొట్టి, తెల్లకాగితాలపై సంతకం తీసుకున్నారని బాధితుడు ఫిర్యాదు చేయగా, నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచి, చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెటేనా!

మొదటిపేజీ తరువాయి...

సమావేశాలను నిర్వహిస్తాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఫిబ్రవరి లేదా మార్చి నెలలో జరిగే సమావేశాల్లో బడ్జెట్‌ను ప్రవేశపెడతాయి. కానీ, రాష్ట్రంలో ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ప్రభుత్వం ఇప్పటి వరకు పరిపాలనపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించలేదు. మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీల అమలుకు నిధుల సమీకరణ, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులపై ప్రభుత్వం ఒక అంచనాకు రాలేదు. వివిధ శాఖల్లో పూర్తిస్థాయిలో అధికారుల నియామకాలు జరుగలేదు. శ్వేతపత్రాల విడుదలతోనే ప్రభుత్వం కాలం వెళ్లదీస్తున్నది. మరోవైపు ఫిబ్రవరిలో లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి, మార్చిలో జరగాల్సిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై కొత్త చర్చ ప్రారంభమైంది. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశాలు లేవని భావిస్తున్నాయి. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్రంలో కూడా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశాలు లేవని, ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తర్వాత కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని, ఆ తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని అంటున్నారు.